# అరుంధతీ శాపం

రోడ్డు ప్రక్కన చెట్టుక్రింద రెక్కలు తెగిన పక్షిలా పడున్నాడు యాదగిరి. ఆ యెండిన చెట్టు అతనికేమీ నీడనివ్వడంలేదు. ఒంటిమీద బలమైన గాయాలు! ఒకటే మూలుగుతూ వున్నాడు.

అది బొత్తిగా జనసంచారం లేని దారేమీ కాదు. అయినా ఆ దారంట పోయే వాళ్ళెవరూ యాదగిరి గురించి పట్టించుకోకుండా చూసీ చూడనట్టు పోతూ వున్నారు.

తద్దినాల బ్రాహ్మడు సుబ్బరాయశాస్త్రి తనలో తాను ఏదో గుణించుకుంటూ అటే వచ్చాడు. యాద గిరిని చూసి మొహం పక్కకు తిప్పుకున్నాడు.

'ప్రొద్దున్నే వీడి పాడు మొహం చూసానేవిటి? అందుకేనేమో నా ఖర్మ కాలి యింతవరకు గిరాకీ లేకపాయె!' అనుకున్నాడు శాస్త్రి లోలోపల.

"పంతులూ! జరా చెయ్యందించు! పైకి లేవలేక పోతుండా!" అంటూ వేడుకున్నాడు యాదగిరి.

శాస్త్రి పులిని చూసినట్టు కంగారుపడిపోయి "ఆరి మాదచ్చోద్! నీకు నేను చెయ్యి అందించాల్రా? నీకు పోయే గాలం వచ్చినాదిరా?" అని ప్రశ్నిస్తూనే దూరంగా జరిగాడు.

"శానా నీరసంగుంది పంతులూ! సచ్చి నీ కడుపున బుడతా! జరా పైకి లేవదీయవా?" అంటూ మళ్ళా ప్రాధేయపడ్డాడు యాదగిరి.

"ఆరి పీనుగా! సచ్చి నా కడుపున బుడతావా? నేనే దొరికినాన్రా నీకు? వెధవా! నేనర్జంటుగా రెడ్డిసాబ్ యింటికి పోవాలె! లేకుంటే దొర నా మీద ఖస్సున లేస్తడు!" అంటూ యాదగిరి చెప్పేది వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు శాస్త్రి.

రక్తస్రావం వల్ల యాదగిరికి నీరసం అధికమయింది.

## సి. గణేశ్ శంకర్ విద్యార్థి

దాహంతో నాలిక ఎండిపోతూవుంది.

ఇంతలో నీళ్ళ బిందె చంకన బెట్టుకుని నాంచారమ్మ అటే వచ్చింది.

"అమ్మా! నో రెండి పోతావుండది! జరా దాహం!" అన్నాడు.

నాంచారమ్మ యాదగిరికి దగ్గరగా వచ్చి అతన్ని యెగాదిగా చూసి కళ్ళెర్రచేసింది.

"ఏవిటి? దాహమా? ఇవి మడినీళ్ళు నాయనా! ఇవి కాస్తా నీకిస్తే నే మళ్ళా యెనక్కిపోవాలి నీళ్ళ కోసం! ఆ!!"

"అమ్మా! ఒక్క గుక్కెడు..."

"గుక్కెడు కాదు! ఒక్క చుక్కకూడా యివ్వను! అంతే!" అంటూ ముందుకు అడుగువేసిన నాంచారమ్మ తనకెదురయిన ఒక అమ్మాయిని చూసి అలాగే నిలబడిపోయింది.

ఆమె అరుంధతి.

"ఏమ్మా? నీవు మనిషివేనా? సాటి మనిషి 'దాహ'మని అరుస్తుంటే నీకు సమజయిత లేదా? కాసిన్ని నీళ్ళు పొయ్యలేవు? అవి మడి నీళ్ళా? ఇన్ని పోస్తే ఏమయితది?"

"అమ్మో, మైలపడవూ?"

"అలాగా?" అంటూ అరుంధతి క్షణంలో నాంచారమ్మ చంకలోవున్న బిందెను చర్రున లాక్కుని యాదగిరి దోసిట్లో నీళ్ళు పోసింది. ఆత్రంగా గటగట నీళ్ళు తాగాడు యాదగిరి. ఇది నాంచారమ్మ ఊహించని పరిణామం!

ఆమె అరుంధతి మీదికి తోక తొక్కిన త్రాచులా లేచింది. అరుంధతిని, యాదగిరిని అర్థమైన తిట్లు తిడుతూ అగ్రహారంవైపు వెళ్ళిపోయింది.

అరుంధతి యాదగిరికి చేయూతనిచ్చి పైకి లేవదీసింది. అతన్ని మెల్లగా నడిపించుకుంటూ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తీసుకొచ్చింది. సమయానికి అక్కడ డాక్టర్ లేడు. కంపౌండర్‌తో చెప్పి యాదగిరి గాయాలకు మందులు, ఇంజక్షను యిప్పించింది.

ఆ తరువాత అతన్ని తన యింటికి తీసుకెళ్ళి భోజనం పెట్టింది. తృప్తిగా భోం చేసిన యాదగిరికి అరుంధతిలో దేవత కనిపించింది.

ఆమెకు చేతులెత్తి దణ్ణం పెట్టాడు.


అరుంధతి గ్రామ సేవిక. ఆమె ఈ వూరొచ్చి యేడాది కావస్తూవుంది. ప్రజల్లో, ముఖ్యంగా అట్టడుగు వర్గాలలో చైతన్యాన్ని పెంపొందించడానికి ఆమె నిర్విరామంగా కృషి చేస్తూవుంది. అది ఏదో కేవలం తన ఉద్యోగ ధర్మంగా ఆమె భావించలేదు; తన జీవిత ధ్యేయంగా భావించింది. సాంఘిక చైతన్యంకోసం ఆమె జరిపే కృషి ఆమెకు శత్రువులను పెంచింది. సమస్యలను ఇనుమడింపజేసింది.

** ** ** **

ఆగస్టు పదిహేను! స్వాతంత్ర్య దినోత్సవం.

సమితి అధ్యక్షుడు మానిక్‌రెడ్డి తన ఛాంబర్‌లో సుఖాసీనుడై సిగరెట్టు వెలిగించి, ఒక్క దమ్ము లాగి దీర్ఘంగా ఆలోచించసాగాడు.

### రచయిత స్వపరిచయం



జననం: డిసెంబర్ 10, 1945. స్వస్థలం: ఏలూరు. ప్రముఖ బ్రహ్మ సామాజికులు, కవులు స్వర్గీయ వంత గడ బాలకృష్ణ–శేషమ్మ దంపతులు నా తల్లిదండ్రులు. విద్యాభ్యాసం ఏలూరు కట్టమంచి రామలింగారెడ్డి కళా శాలలో బి.ఎ., ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరులో ఎం.ఎ. ప్రభుత్వ పాలనాశాస్త్రంలో.

అభిరుచి: రచనా వ్యాసంగం, నాటక కళల్లో.

ప్రస్తుతం బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ కళా శాల, జడ్చర్లలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. సామాజిక ప్రయోజనం గల రచనలు చేసి యువతరం ఆలోచనా సరళికి పదును పెట్టాలనేది నా ధ్యేయం.

లోగడ 'ఆంధ్రజ్యోతి'వారు నిర్వహించిన 1985 సంక్రాంతి కథల పోటీలో నా కథ 'వెలి' సాధారణ ప్రచురణకు ఎన్నికయింది. నా మొట్టమొదటి కథ 'బలి' కృష్ణా పత్రిక (1985 నవంబర్)లో ప్రచురితమయింది.

శుభాకాంక్షలతో

గణేశ్ శంకర్ విద్యార్థి

'అరుంధతి వ్యవహారం చూస్తుంటే రోజు రోజుకూ శ్రుతి మించిపోతుండాది! ఆఫ్టరాల్ ఏదో గ్రామ సేవిక, పోనీలే! అనుకుంటే ఆ పోరి చివర్కి నన్నే పరేషాన్ చేస్తుండది!! ఇందాకటి మీటింగులో ఏం మాట్లాడింది? పంచాయతీ రాజ్యంనిండా భూస్వాములే వుండారన్నది; చెట్టుపేరు జెప్పి కాయలమ్ముకుంటున్నరు అంది!! అంటే —నాకే దెబ్బ కొట్టిందన్నమాట! దీనికి ఊర్కుంటె గాదు! దెబ్బకు దెబ్బతీయాలె!'

"నమస్తే! రెడ్డి సాబ్!!"

తలయెత్తి చూశాడు మానిక్‌రెడ్డి.

ఎదురుగా చేతులు జోడించి నిల్చున్న సుబ్బరాయ శాస్త్రి.

"ఏం శాస్త్రి? అటే నిలబడిపోతివి? రా! అగ్రహారంలో అంతా మామూలేనా? కొత్త సంగతులేమయినా వున్నయ్యా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు.

"దొరవారూ! మార్పులేమయినా వుంటే మీకు తెలియకుండా వుంటయ్యా? తమరు యేడాది క్రితం ప్రారంభోత్సవం చేసిన వేద పాఠశాల ఈ నాటికి వయోజన పాఠశాలగా మారింది! రాత్రయ్యేసరికి అలగా జనమంతా అక్కడ చేరేది! వాళ్ళకు పాఠాలు నేర్పేది ఎవరో తెలుసా?"

"ఎవరు?"

"ఇంకెవరు సాబ్? ఆ అరుంధతి

"అరుంధతా? పంతులమ్మ అయిందా పోరి?"

"తమరు గట్లనే వూరుకుంటే యింకా ఏ మయినా అయితది!" అగ్నికి ఆజ్యంపోశాడు శాస్త్రి.

** ** ** **

మంజీర ప్రవహిస్తూ వుంది.

యేట్లో నీళ్ళు పెద్దగా లేవు. అయినా వంపు సొంపులకేం తక్కువ లేదు. ఆ నదీమతల్లి అందాల్ని పుణికి పుచ్చుకున్నవాళ్ళు అందోలు, జోగి పేటలలో జోగినులు, అభాగినులు. దైవం పేర, మతం పేర, సంప్రదాయం పేరిట బలిపశువులై జీవచ్ఛవాలుగా బతికే జోగినులు. శాపగ్రస్తలైన యోగినులు.

పదహారేళ్ళ జోగమ్మ 'జోగిని'గా మారి నాలుగేళ్ళు కావస్తూవుంది. నిమ్నజాతుల్లో నిరుపేద కుటుంబాల్లో కడగొట్టు ఆడపిల్లని 'ఆడపాప' లేదా 'బసివి'గా వది లేయడం ఈ ప్రాంతంలో మామూలే. దైవానికే ఆమె జీవితం అర్పించబడిందని ఆ పిల్ల తల్లిదండ్రులు విశ్వసించి ఊరుకుంటారు. సంఘపరం చేయబడ్డ అట్టి



యువతులు వ్యభిచరించక తప్పదు. వారే జోగిములు. అలాంటి ఓ జోగినితో అరుంధతికి పరిచయం కలిగింది. ఆ రోజు—

రాత్రి ఎనిమిది గంటలు దాటింది.

వయోజన పాఠశాలలో పెట్రోమాక్సు లైటు వెలుగుతూ వుంది. అరుంధతి వయోజనులకు పాఠం చెబుతూ వుండగా జోగమ్మ వచ్చింది.

"అమ్మా! నేను మీ బడిలో సదూకుంటా!" అంది.

"చాలా సంతోషమమ్మా! నీ పేరు?" అడిగింది అరుంధతి.

"జోగమ్మ!!"

జోగమ్మ అలా అనగానే అక్షరాలు దిద్దుకుంటున్న కొందరు పెద్దవాళ్లు ఆమెను వింతగా చూడసాగారు. అంతవరకు పలక మీద 'అ, ఆ'లు రాస్తున్న వీరారెడ్డి ఆమెను చూసి కళ్లతోనే కారాలు మిరియాలు నూరసాగాడు. పక్కనే వున్న మీసాల వెంకటరెడ్డిని దగ్గరగా పిలిచి చెవిలో ఏదేదో చెప్పాడు.

వెంకటరెడ్డి లేచి "అమ్మా! ఈ పిల్ల జోగిని!! ఇది సదూకుంటదా? దీన్ని రానీబాకండి! రానిస్తే మాకు సదువు చెడిపోద్ది!" అన్నాడు.

వీరారెడ్డి లేచి "ఈ పిల్ల మాలపల్లిలోంచి వస్తది! ఇంతవరకు ఈ రాత్రి బడికి మాల మాదిగోళ్లు రాలేదు!! అందుకని......." అంటూ ఏదో చెప్పబోగా——

"ఇంతవరకు రాకపోవచ్చును. ఇప్పుడు వస్తారు!" అంది అరుంధతి స్థిరంగా.

"మాల, మాదిగోళ్లకి నువు సదువు జెప్పాలనుకుంటే ఆళ్లకి యేరే బడి పెట్టుండ్రి! గంతే!!" అన్నాడు వెంకటరెడ్డి కళ్లెర్రజేస్తూ.

"లేకపోతే?...." ప్రశ్నించింది అరుంధతి కోపంగా.

"లేకపోతే ఈ సంగతి పెద్దదొరగారికి జెప్పాల్సి వుంటది! ఆ తరువాత ఈ బడీ వుండదు! నువ్వూ వుండవు!!" అన్నాడు వెంకటరెడ్డి.

ఆశ్చర్యపోయింది అరుంధతి.

అంతా వెళ్ళిపోయింతర్వాత ఓ మూలని ఒదిగి కూర్చున్న జోగమ్మ దగ్గిరకి వెళ్లి ఆమె ప్రక్కనే కూర్చుని "నువు భయపడ్డావా?" అనడిగింది అరుంధతి.


"అమ్మా! నువుండంగ నాకేం బయం?"

"జోగమ్మా! ఇలా జోగినిగా బ్రతకడం నీకు బావుందా?"

"అమ్మా! నన్నిలా అడగడం నీకు బాగుం దా? నాకే గాదు, నా వయసోళ్లే, నా తోటోళ్లే బాగమ్మ, యాదమ్మ, పోచమ్మ ఎవ్వరికీ ఈ పాడు బతుకు బతకాలని లేదు! అయితే— యింకో మారగం సూపే! మరోదారి అనేది మాకు వుందాదా?"

"మీ అమ్మ, నాన్న తలుచుకుంటే నీ బతుకును యిట్టే మార్చగలరు!"

"మా అమ్మ, నాన్నలకి నా సంపాదన కావాలె! నేను శవాల ముందు ఆడాలె! ఆళ్లు పైసలు జల్లుతుంటరు! నేను ఆడుతూ ఆ పైసలు తీయాలె! ఒళ్లు దాసుకోకూడదు! దొరలు పిలిస్తే కాదనేది లేదు!



పోవాలి! ఆడాలి! పాడాలి! పండాలి! గదీ నా బతుకు!" అంటూ పైటకొంగుతో కళ్ల నీళ్లు తుడుచుకుంది జోగమ్మ.

*** *** ***

జోగినాథుని జాతర!

జోగిపేట గ్రామమంతా సంబరంతో కోలాహలంగా వుంది. ఆ వూరి సంప్రదాయం ప్రకారం జోగినాథస్వామి రథం పోచమ్మగుడి మీదుగా జోగినాథుని గుట్ట వరకు రావాలి.

రథం బయలుదేరింది. రథం వెంట పెద్ద ఊరేగింపు. వందలాది జనం. పెద్ద దొర మానిక్ రెడ్డి, మీసాల వెంకటరెడ్డి, సుబ్బరాయశాస్త్రి యింకా కొందరు ముఖ్యులు రథానికి ముందు నడుస్తున్నారు.

రథం పోచమ్మ గుడి దగ్గిర ఆగింది.

పోచమ్మ గుడి దగ్గిర హరిజనులు చాలా మంది రథం రాకకొరకు కనిపెట్టుకుని కూర్చున్నారు. వాళ్లలో జోగమ్మ, ఆమె తండ్రి నర్సింములు తదితరులు పెద్ద దొర కంటబడ్డారు. జోగమ్మ పక్కనే నిలబడ్డ ఒక యువకుణ్ణి పరకాయించి చూసి అతడు యాదగిరి అని గుర్తించాడు దొర. లోగడ తన దగ్గిర పాలేరుగా వున్న యాదగిరి ఒకసారి తనకు ఎదురు చెప్పినందుకు వెంకటరెడ్డితో చెప్పి యాదగిరికి బాగా దేహశుద్ధి చేయించాడు. 'అయితే వీడికి జోగమ్మతో దోస్తీ వుందన్న మాట!' అనుకున్నాడు మనసులో.

సుబ్బరాయశాస్త్రి మైకులో జరగబోయే కార్యక్రమాన్ని వివరించాడు. పోచమ్మ గుడి ముందు జోగినులు నాట్యం చేయాలి. హరిజనులు డప్పులు వాయించాలి.

"జోగమ్మా! యాదమ్మా! బాగమ్మా! రండ్రి! ఆడడం షురూ జేయండ్రి! అరే నర్సింములూ! డప్పులోళ్లకి యింత జాష్ జేసినావా లేదా? జల్దీ షురూ కర్ నా!!" అంటూ హుకుం జారీచేశాడు దొర.

"మే ఆడం!" అంది జోగమ్మ ముందుకొచ్చి.

"ఏం? ఎందుకని?" ప్రశ్నించాడు దొర ఆశ్చర్యంగా.

"మే ఆట బొమ్మలం కాదు!"

"అలా నీకెవరు జెప్పినారు?"

"అరుంధతమ్మ!!"

"అమ్మనీ.....! అదింత పని జేస్తుందనుకుంటనే వున్నా! గట్లనా? సరే! శాస్త్రీ! రామనాథశర్మా! మీరేమంటరు? చెప్పండ్రి!" హుంకరించాడు దొర.

పూజారి రామనాథశర్మ యిలా అన్నాడు:

"పోచమ్మ గుడి కాడి నుంచి జోగినులు నాట్యమాడాలె! పంచములు డప్పు వాయించాలె! ఇది ఆచారం! శాస్త్రం! దీన్ని కాదనడానికి ఎవరికీ హక్కులేదు! ఇది కట్టుబాటు!"

"ఆ రివాజు యివాళతో ఆఖరు గావాలె!" అని పలికిందో కంఠం.

ఎవరా అని అందరూ అటు చూశారు.

అరుంధతి!

"వీళ్ళందరి వెనక వున్న శక్తి ఏమిటా అని అనుకున్నా! ఇప్పుడర్థమయింది వీళ్ళని నడిపిస్తున్నది నువ్వని!" అన్నాడు దొర.

"కట్టుబాటును ఉల్లంఘించడం దైవ ధిక్కారమే అవుతుంది! అట్టి అపచారాన్ని దొరవారు క్షమించరు!" అన్నాడు శాస్త్రి అదను దొరికినందుకు సంతోషిస్తూ.

"ఏమిటి మీ కట్టుబాట్లు? మనిషిని పశువుకన్నా హీనంగా చూడడమా? వాళ్ళను మీ నుంచి వెలి వెయ్యడమా? జోగిని ఆడకపోతే జోగినాథుడికి కోపం వస్తుందా?" అని అడిగింది అరుంధతి.

ఆమె కళ్ళలోంచి నిప్పులు కురిశాయి.

"నువ్వు దైవ దూషణ చేస్తుందావు! అంటరాని

వాళ్ళని వెలివేసి దూరంగా వుంచడం కొత్త సంగతా?'' ప్రశ్నించాడు రామనాథశర్మ.

''శర్మా! తల్లి గర్భంలో వున్నప్పుడు నీకు కుల ముందా? నువ్ చచ్చి వల్లకాట్లో నిన్ను పండబెట్టే నప్పుడు నీదే మతం? నువు పీల్చేగాలి, తాగేనీరు ఏ వర్ణానివి?'' అని అరుంధతి ప్రశ్నించింది.

మారు మాట్లాడలేకపోయాడు శర్మ.


''శర్మా! శాస్త్రీ! మీరు మాట్లాడనవసరం లేదు! మతాన్ని, సంప్రదాయాన్ని కాపాడే బాధ్యత పెద్ద దొరనైన నాది! అరుంధతిని నేను క్షమించను!! దీనికి మన కానూన్ ననుసరించి ఏం శిక్ష వెయ్యాలె?'' అడిగాడు దొర ఆవేశంతో వూగిపోతూ.

''దాన్ని చెట్టుకు కట్టే కొరడా దెబ్బలు కొట్టాలె! అదే దానికి శిక్ష!'' అన్నాడు శర్మ..

''అంతే!'' అన్నాడు శాస్త్రి.

గుడి బయట గుంజకు కట్టివేయబడ్డ మేకపోతు బిత్తర చూపులుచూస్తూ వుంది. దాన్ని స్వర్గానికి పంపేందుకు పదునుపెట్టబడ్డ కత్తి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తూ వుంది. ఆ కత్తికి పసుపు, కుంకుమలు అంటించి సిద్ధంగా వుంచాడు వీరారెడ్డి.

వందలాది మూర్ఖజనం కళ్ళప్పగించి చూస్తుండగా ఇద్దరు హమాలీలు అరుంధతిని లాక్కొచ్చి చెట్టుకు




పెడరెక్కలు విరిచి కట్టేశారు. జోగమ్మకు ఏం చేయాలో తోచలేదు. దొర వికటంగా నవ్వుతూ దగ్గర కొచ్చి అరుంధతి ముఖంమీద ''ధూ!''... అని ఊశాడు. కొరడా తీసి అరుంధతిని కాళ్ళపై, చేతులపై గొడ్డును బాదినట్టు బాదసాగాడు. ఆ దెబ్బలకు తట్టుకో లేక అరుంధతి ఏడుస్తుంటే అక్కడ చేరిన జనం వేడుక చూస్తున్నారు.

అరుంధతి ముక్కువెంట, నోటివెంట రక్తం స్రవిస్తూవుంది. శక్తంతా కూడగట్టుకుని ఆమె ఇలా అంది:

''నీ దొరతనం ఆఖరయితది!! జోగినుల ఉసురు నిన్ను ఖతం జేస్తది!! అంటరానోడు అంబేద్కరీయుడై నిన్ను అం...తం... జే...స్త...డు...!!''

పిడికిలి బిగించి దొర ఆమె కడుపులో బలంగా ఒక్కపోటు పొడిచాడు.


అంతే! అరుంధతి తలవాల్చేసింది.

ఆగ్రహావేశాలు ముప్పిరి గొనగా చెట్టుచాటుమండి బయటకొచ్చాడు యాదగిరి. అందరూ అతన్ని చూసి భయభ్రాంతులయ్యారు.

క్షణంలో మేకపోతును నరికేందుకుంచిన కత్తిని లాక్కుని మెరుపులా దొరమీదికి లంఘించాడు. ప్రళయ కాలరుద్రుడై యాదగిరి కత్తితో దొర మెడ తెగనరికాడు. దొరతనం నేల కూలింది. రథచక్రాలవద్ద రక్తపు మడుగు ఏర్పడింది.

ఆ రక్తంలో జోగమ్మ నొసట తిలకం దిద్దాడు యాదగిరి.

శ్రీమహాలక్ష్మీ వారి సరికొత్త నవలలు
ఫిబ్రవరి 7 విడుదల!
సగటు మనుషులు (కథలు)............ రూ 18/-
దూరం, అద్దెకిచ్చిన హృదయాలు........ రూ 20/-
మల్లాది వెంకటకృష్ణమూర్తి
గోకులంలో రాధ...... వంశీ............ రూ 18/-
(స్వాతివీక్లీ సీరియల్, త్వరలో సినిమా)
మహావేధ.... చివుకుల పురుషోత్తం..... రూ 25/-
పావని............ సి. విమలా గణేష్............ రూ 18/-
జీవనవీణ.... మద్దిపట్ల సూర్యప్రకాశరావు........ రూ 16/-
కొత్త సంగీత విద్యాదర్పణము............ రూ 60/-
(సంగీత విద్యార్థుల కుపయుక్తము) ఏకా సుబ్బారావు
నేడే అడ్వాన్సుతోపాటు ఆర్డరుకూడా పంపండి!
శ్రీమహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్, విజయవాడ-2
ఫోన్: 63322

SUGUNA
సుగుణ
వ్యవసాయమునకు, పరిశ్రమలకు
ఉపయోగదాయకము


తయారుచేయువారు:
శబరి ఇండస్ట్రీస్
65, అవినాశి రోడ్,
కోయంబత్తూరు-641 018
ఫోను: 25517 & 25518
వివరములకు సంప్రదించండి:
శ్రీ రామకృష్ణ కార్పొరేషన్
6, ఎల్లిబాలు చెట్టి వీధి, మద్రాసు-600 001. ఫోను: 21110-30401
బ్రాంచి: దొరస్వామి అయ్యంగార్ రోడ్, చిత్తూరు. (A.P.)
ఫోన్: 2985 & 2661
బ్రాంచి: S.M. మోడి. కమర్షియల్ కాంప్లెక్స్, కర్బాలా మైదాన్,
M.G. రోడ్, సికింద్రాబాద్-500 003 (A.P.) ఫోన్: 825291